పరిసరాల శుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో గురువారం స్వర్ణాంధ్ర స్వచంద్ర కార్యక్రమాన్ని గురువారం పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి వీదిలో తిరుగుతూ చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయ రాదని, వాటితో ప్రబలే వ్యాధులపై అవగాహన కల్పిం చారు. పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు.

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆశా కార్యకర్తల వేతనాలు పెంచండి

-మహాసభలో ఐద్వా, సిఐటియు నేతల డిమాండ్

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు విజయ

ప్రజాశక్తి పాడేరు :- ఆశా కార్యకర్తల వేతనాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిఐటియు డిమాండ్ చేసింది. ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అల్లూరు జిల్లా ద్వితీయ మహాసభ పాడేరు పి ఎం ఆర్ సి ఆవరణలో గురువారం నిర్వహించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గాసమ్మ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభ కు ముఖ్యఅతిథి హాజరైన ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు వి.విజయ మాట్లాడుతూ, సంఘం పెట్టినప్పటి నుంచి ఆశా కార్యకర్తలు అనేక సమస్యలపై పోరాడి పరిష్కరించుకోవడం జరిగిందని అన్నారు. ప్రధానంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల గొంతు కోసే ప్రయత్నాన్ని ఐక్యంగా వ్యతిరేకించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా కార్మికులను కనీస వేతనం అమలు చేయడంలో, పర్మినెంట్ చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు.ఆశ కార్మికుల సంఘం పెట్టిన 25 సంవత్సరాలు కాలంలో అనేక సమస్యలు పోరాటం ద్వారా పరిష్కారం పరిష్కరించుకున్నామని, వంద రూపాయలు వేతనం నుండి పదివేల వరకు పోరాడి సాధించుకున్నామన్నారు. మన రాష్ట్రంలో పోరాట ఫలితంగా ఈ మధ్యకాలంలో ఆశ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద 1,50,000, ఇద్దరు పిల్లల వరకు ప్రసూతి టైంలో మెటర్నటీ సెలవులు 180 రోజులు ఆరు నెలల జీతంతో కూడినటువంటి సెలవులు మంజూరు, రిటైర్మెంట్ వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంపు వంటివి పోరాడే సాధించుకున్నామన్నారు. కనీస వేతరం 26,000 ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని, యాప్ లు ద్వారా వర్క్ పూర్తిగా తగ్గించాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని వంటి సమస్యలపై రాజీ లేని పోరాటానికి సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పాడేరు డివిజన్లో 725 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఉన్నారని తక్షణం వారిని ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభను ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పోతురాజు మాట్లాడుతూ, వేతనాల పెంపు ఇతర హామీలు అమలు కోసం భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధం కావాలని తెలిపారు. సహాయ కార్యదర్శి సుందరరావు మాట్లాడారు. ఈ మహాసభకు 11 మండలాల నుంచి 150 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి చింతపల్లి:- చింతపల్లి మండలం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లోతుగెడ్డ, కోరుకొండ. చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రినీ అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విశ్వేశ్వర నాయుడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న గ్రామాల రోగులకు అందిస్తున్న వైద్య సేవల రికార్ధులను పరిశీలించారు. పి. హెచ్.సిలు మరియు ఎరియా ఆసుపత్రి చింతపల్లిలో సుఖప్రసవాల గురించి వైద్యాధికారికి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రులలో నమోదయిన మలేరియా కేసులు, అందిస్తున్న చికిత్సల గురించి వైద్యాధికారికి అడిగి తెలుసుకున్నారు. ఎపిడమిక్ సీజన్లో వైద్య సిబ్బంది గ్రామస్థాయిలో సందర్శించి సకాలంలో రోగులను వైద్య సేవలు అందించవలసిందిగా ఆదేశించారు. ఆసుపత్రులలో ఉన్న మందుల నిలువలను, అన్ని వార్డులను తనిఖీ చేశారు. అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాల్సిందిగా వైద్యాధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి చింతపల్లి వైద్యాధికారులు, జిల్లా కార్యాలయ ఆరోగ్య విస్తరణ అధికారులు గుల్లేలి సింహాద్రి, యం సంజీవ్ పాత్రుడు, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, పి. హెచ్.సి పి. హెచ్ సిల సిబ్బంది పాల్గోన్నారు.

తనిఖీలు చేపడుతున్న డిఎం హెచ్ఒ

నినాదాలు చేస్తున్న గిరిజనులు

హైడ్రో పవర్ ప్రాజెక్టుపై నిరసన

ప్రజాశక్తి-అరకులోయ:ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో అరకువేలి మండలం బస్కి పంచాయితీ కంజరి తోట గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్తో గిరిజన ప్రాంతం నాశనం అవుతుందని నినాదాలు చేశారు. తక్షణమే ఈ ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్తో పంటలు, పొలాలు నాశనం అవుతాయయని, గిరిజనుల మనుగడకే కష్టం అవుతుందని స్థానిక గిరిజనులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొర్రా దేవన్న, సుబ్బారావు, రాంబాబు, రామన్న, చిన్నం నాయుడు, నాగేశ్వరరావు, రామన్న పాల్గొన్నారు.

కాఫీ రైతులకు పంట నష్టపరిహారం

-గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పించాలి- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు:కాఫీ సాగు చేస్తున్న గిరిజన రైతులకు పంట నష్టపరిహారం అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించాలని అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, కాఫీ బోర్డులోని ఐటీడీఏ కాఫీ కార్యనిర్వాహకులు, విస్తరణ అధికారులు క్షేత్ర సందర్శనల సమయంలో, అరకువ్యాలీ మండలం, ఐటీడీఏ పాడేరు ప్రాంతంలోని చినలబుడు గ్రామ పంచాయతీలోని పకనకుడి, తురాయిగూడ మాలిసింగారం, తుడిమ, చినలబుడు, మాలివలస గ్రామాలలోని కొన్ని కాఫీ తోటలలో మొదటిసారిగా కాఫీ బెర్రీ బోరర్ సంక్రమణ కనబడిందన్నారు. కాఫీ బెర్రీ బోరర్ గుర్తించిన వెంటనే అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కాఫీ బెర్రీ బోరర్ గుర్తించిన ప్రాంతం నుండి ఎంత వరకు ఇన్ఫెక్షన్ ఏరియా అన్నది నిర్ధారించాలన్నారు. జోన్ల వారిగా రెడ్, ఎల్లో, బ్లూ ఫ్లాగ్స్ ఏర్పాటు చేసి జోన్లో చేపట్టవలసిన చర్యలు తెలియజేయాలన్నారు. మండల అభివృద్ధి అధికారులు ఈనెల 5నుండి గ్రామ సభలు ఏరాటు చేయాలన్నారు.రెడ్, ఎల్లో, బ్లూ ఫ్లాగ్స్ ఏర్పాటు చేసి జోన్లో తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామ సభల్లో సర్పంచులు, వార్డు మెంబర్స్ పాల్గొనేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి, కాఫీ బోర్డు అధికారులు రోజువారీ నివేదికలు అందజేయాలన్నారు.

అరకు లోయ:ప్రభుత్వం కాఫీ రైతులకు నష్టపరిహారం ఇస్తుందని జాయింట్ కలెక్టర్, ఇంచార్జ్ ప్రాజెక్టు అధికారి . ఎం.జె. అభిషేక్ గౌడ అన్నారు. ప్రాజెక్టు అధికారి గురువారం అరకు వ్యాలీ మండలం పాకనకుడ్డి గ్రామంలో కాఫీ బెర్రీ బోరర్ సోకి నష్టపోయిన కాఫీ రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ కాఫీ బెర్రీ బోరర్ గుర్తించిన వెంటనే అరికట్టే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందని, కాఫీ బెర్రీ బోరర్ గుర్తించిన ప్రాంతం నుండి ఎంత వరకు ఇన్ఫెక్షన్ ఏరియా అన్నది నిర్ధారించి. జోన్ ల వారిగా రెడ్, ఎల్లో, బ్లూ ఫ్లాగ్స్ ఏర్పాటు చేసి జోన్ లో చేపట్టవలసిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కాఫీ ఫీల్డ్ ఫంక్షనరీ సూచనల మేరకు కాఫీ బోర్డు కెజి కాఫీ కిలో 50 రూపాయలు నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని, పూడ్చిపెట్టే ఖర్చు ఇతర ప్రయోజనాల కోసం ఎకరానికి రూ.5వేల రూపాయలు చెల్లించడం జరుగుతుందన్నారు. కాఫీ తోటకి పట్టిన పురుగుని నాశనం చేయాలన్నారు. లేకపోతే హ్యాపీ ఉత్పత్తి తగ్గుతుందన్నారు. రానున్న రెండు రోజుల్లో కాఫీ పంటలో వచ్చిన పంటను తీసి వేడినీటిలో ఉడకబెట్టి దానిని మట్టిలో పూడ్చాలన్నారు. లేకపోతే ఆ పురుగు విస్తరించి మరింత నష్టాన్ని కలిగిస్తుందన్నారు. నష్టపోయిన రైతులు ఎవరూ కలత చెందవద్దని నష్టపరివారం ప్రభుత్వం ఇస్తుందన్నారు ఈ అవగాహన కార్యక్రమంలో పాడేరు సబ్ కలెక్టర్ శౌర్య మన్ పటేల్, సహాయ కలెక్టర్. సాహిత్ , కాఫీబోర్డు డిడి రమేష్ తదితరులు ఉన్నారు.

వర్షాలకు కల్వర్టు బురదమయం

-అవస్థలు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-హుకుంపేట: పట్టాం పంచాయతీ పరిధిలోని డాబవలస గ్రామ సమీపంలో నిర్మించిన తాత్కాలిక కల్వర్ట్ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతింది. దీంతో గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు విద్యార్థులు పాఠశాలలకు, ఉద్యోగులు విధులకు వెళ్లడానికి ఈ మార్గాన్ని వాడుకోవాల్సి రావడంతో ఇబ్బందులు మరింతగా పెరిగాయి. రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇల్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణానికి అవసరమైన ఇటుకలు, ఇసుక వంటి సరుకులు తరలించలేక ఇబ్బంది పడుతున్నారు. గురువారం ఇల్లు నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు ఇటుకలు తెస్తూ లారీ కల్వర్ట్ వద్ద ఇరుక్కు పోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నూతనంగా ప్రారంభించిన శాశ్వత కల్వర్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వారు అధికారులను కోరుతున్నారు.

మట్టిలో కూరుకు పోయిన లారీ

వీడని ముంపు భయం..

విద్యార్థులకు చదువుల్లేవు. కూలి పనులు చేసుకుని నాలుగు రూపాయలు తెచ్చుకుందామంటే 'దారి' లేదు. రోగులకు దవాఖానాకు వెళ్లి సూదిమందు తీసుకుందామన్నా దిక్కు లేదు. గర్భిణులు, బాలింతల అవస్థలు వర్ణనాతీతం. పప్పు, ఉప్పు కావాలన్నా పడవ ఎక్కాల్సిందే. కూడూ లేదు, స్థిరమైన గూడూ లేదు. ఇదీ గోదావరి ముంపు గ్రామాల బాధితుల క'న్నీటి' కథలు..వెతలు..గోదావరి నీటిమట్టం కాస్త తగ్గుతూ, కాస్త పెరుగుతూ దోబూచులాడుతోంది. దీంతో ముంపు బాధితులు ఆందోళన చెందుతున్నారు. 18 రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇంకా ఎన్నాళ్లీ దురవస్థ అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- స్వల్పంగా తగ్గిన గోదావరి, శబరి నీటి మట్టాలు
- 18 రోజులుగా రహదారుల మీదే వరద
- పడవలపైనే ప్రయాణాలు

ప్రజాశక్తి -విఆర్పురం:

ఏజేన్సీలో ఈ వరదలు ఇంకెన్ని రోజులు ఉంటాయని ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. వరదవచ్చి 18 రోజులు పూర్తయినా నేటికీ ఏజేన్సీని వరద వీడకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఒక పక్క వర్షం మరోపక్క వరదలతో ఏజేన్సీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి 35.60 అడుగులు ఉండగా బుధవారం సాయంత్రం 6 గంటలకు అలాగే నిలకడగా ఉంది. బుధవారం సాయంత్రం 5 గంటల సమయానికి 41.40 అడుగులు ఉన్న గోదావరి నెమ్మదిగా పెరుగుతూ 42.10 అడుగులకు గురువారం ఉదయానికి 44.10 అడుగులుగా ఉంది సాయంత్రం 6 గంటలకు 42.70 వద్ద ఉంది. ఇలా తగ్గుతూ, పెరుగుతూ బాధితులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. వ్యవసాయ సీజన్ మొదలు కావడంతో మండల కేంద్రానికి వచ్చి ఎరువులు కొనుగోలు చేసుకుని వరద నీటిలోనే వెళ్లాల్సి వస్తోంది. విద్యార్థులు కూడా వడ్డిగూడెం నుండి విఆర్పురంలో హైస్కూల్కి వెళ్లడానికి ట్రాక్టర్లపై ప్రయాణం చేస్తున్నారు. రోగులు పడవలపై ప్రయాణాలు చేస్తున్నారు. రైతులు, అన్నదాతలు తీవ్రకష్టాలు పడుతున్నారు. పంట కోసం యూరియా బస్తా భుజాన వేసుకుని వరద నీటిలో నడుచుకుంటూ వెళ్లి పడవ మీద వెళుతున్నారు. ఏజెన్సీలో వరదలతో బాలింతలకు, రోగులకు తిప్పలు తప్పడం లేదు. ఆసుపత్రులకు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. జల్లివారిగూడెం శ్రీరామగిరి, వడ్డుగూడెం, చింతరేగుపల్లి, అడివివెంకన్నగూడెం, తొట్టి వారిగూడెం, రామవరం గ్రామాల మధ్య వాగులపై రహదారులపైనే వరద ఉండటంతో ఈ దుస్థితి ఏర్పడింది.

రహదారుల్లో తగ్గని వరద నీరు

రహదారులపైనే వరదనీరు ఉండడంతో ఇంకా కొన్ని గ్రామాలకు రాకపోకలు లేక అవస్థలు పడుతున్నారు. శ్రీరామగిరి, వడ్డిగూడెం, రామవరం, అడివి వెంకన్నగూడెం, చింత రేగుపల్లి, సీతమ్మ పేట మధ్య వరద తగ్గినట్టే తగ్గి బుధవారం సాయంత్రం నుండి భద్రాచలం వద్ద వరద పెరగడంతో రోడ్డుపై నడుము లోతు ప్రవాహం ఉంది. ఇంకా వరద పెరిగే అవకాశం ఉంటే మళ్ళీ ఇళ్లను వరద తాకే విధంగా వరద పొంచి ఉందని ప్రజలు వాపోతున్నారు. కూలి పనులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయా గ్రామాలు ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒడ్డుగూడెం నుంచి విఆర్పురం బోటుపై వెళుతున్న ముంపు వాసులు

31 అడుగుల వద్ద నిలకడగా శబరి

చింతూరు: వరదల కారణంగా ఎట్టకేలకు భారీ వర్షాలు తగ్గుముఖం పట్టడంతో చింతూరు శబరి నది నీటిమట్టం బుధవారం కంటే మూడు అడుగులు తగ్గి 31 అడుగుల వద్ద నిలకడగా ఉంది. కుయుగూరు వాగు బుధవారం నుండి తగ్గడంతో రెండు రోజుల నుండి ఆంధ్రా, ఒడిశా రవాణా సౌకర్యం మెరుగుపడింది. సీలేరు, చంద్రవంక, కొమ్మూరు వాగులు ఇంకా ఉధృతంగానే ప్రవహిస్తోంది. కొమ్మూరు కొయ్యూరు పొలాలు వరద నీటిలోనే ఉన్నాయి. నాటు పడవలపైనే సోకులేరు వాగు దాటుతూ మండల కేంద్రానికి వచ్చి నిత్యావసరాలు తీసుకువెళుతున్నారు. సుమారు 20 గ్రామల ప్రజలు వరద నీటితో ఇబ్బందులకు గురవుతున్నారు.

ఎటపాక: వర్షాలు తగ్గినప్పటికి వరద మాత్రం వదలడం లేదు. గత 15 రోజులుగా వర్షాలు వరదలతో లోతట్టు గ్రామాల నుండి వరద ముంపు వీడడం లేదు. నెల్లిపాక, తోటపల్లి, నందిగామ, మురుమూరు వాగుల్లో వరద నీరు పోటు వేసింది. వ్యవసాయ భూములు ఇంకా ముంపు లోనే ఉండటంతో వరద ఎప్పుడు వీడుతుందా అని అన్నదాతలు ఎదురు చూస్తున్నారు.

ఎటపాక: నెల్లిపాక వాగు వద్ద వరద పరిస్థితి

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నమాణిక్యం

యువత నూతన ఆవిష్కరణ దిశగా ఎదగాలి

ప్రజాశక్తి - చింతూరు : యువత నూతన ఆవిష్కరణ దిశగా ఎదగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రత్నమాణిక్యం తెలిపారు. కళాశాలలో గురువారం ఆవిష్కాంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత స్వావలంబన, సుస్థిరత, సమగ్రతతో కూడిన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేస్తూ భారతదేశ అభివృద్ధి, ప్రపంచ నాయకత్వానికి తోడ్పడాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ ప్రతి ఆలోచనలోనూ, ప్రతి వ్యాపారంలోనూ, నైతిక విలువలు, నిజాయితీ, బాధ్యతను పాటించాలని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు అపనమ్మ, శకుంతల, హారతి, అధ్యాపకేతర బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న జుత్తు కుమార్

విద్యార్థుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

ప్రజాశక్తి -రంపచోడవరం : డివిజన్ పరిధిలో గల ఆశ్రమ పాఠశాల విద్యార్థుల పట్ల ఉన్నత స్థాయి విద్యాధికారులు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నారని సిపిఐ రంపచోడవరం డివిజన్ కార్యదర్శి జుత్తు కుమార్ అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలు ఆశ్రమ పాఠశాలల విద్యార్థులను డివిజన్ కమిటీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలో గత సంవత్సరం కాలం నుండి పలు ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు మృతి చెందడం దారుణమన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి - వై.రామవరం : గణేష నిమజ్జనం సందర్భంగా విగ్రహాలను పెద్దకాలువలకు తీసుకెళ్లి, నిమజ్జనం చేశారు. కనతలబందలో కూడా నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

జికె వీధి : మండలంలోని జర్రెల కొత్తూరు గ్రామంలో వినాయక నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. గణపతి లడ్డూ వేలం 19,000 కు చేరిందని నిర్వాహకులు తెలిపారు.

మాట్లాడుతున్న ఎఇ కల్యాణ్‌రామ్

ఆదికర్మయోగి యోజనతో గ్రామాభివృద్ధి

ప్రజాశక్తి-జికెవీధి: ఆదికర్మయోగి యోజన కార్యక్రమంతో గ్రామాభివృద్ధి జరుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ కళ్యాణ్‌రామ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదికర్మయోగి యోజన కార్యక్రమం ఎంపిటిసి రిమల రాజేశ్వరి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీ బాలకృష్ణ గ్రామసభ నిర్వహించగా ముఖ్య అతిథిగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ కళ్యాణ్‌రామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివద్ధిపై పలు అంశాలను గూర్చి చర్చించారు. సిసి రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు, కమ్యూనిటీ బిల్డింగ్ కావాలని గ్రామస్తులు కోరారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తానని కళ్యాణ్‌రామ్ అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - రంపచోడవరం : 11 కె.వి రంపచోడవరం ఫీడర్, 33 కె.వి మారేడుమిల్లి ఫీడర్, 11 కె.వి ఇందుకూరుపేట ఫీడర్ నందు ఫ్రైడే మైంటెనెన్సులో భాగంగా రంపచోడవరం, సిరిగిందలపాడు, మారేడుమిల్లి మండలం పరిసర ప్రాంతాలకు గంగవరం మండలం పెదగార్లపాడు నుండి మొల్లేరు వరకు ఉన్న గ్రామాల్లో దేవీపట్నం మండలం ఉప్పయ్యపాలెం నుండి శరభవరం పరిసర ప్రాంతాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. వినియోగదారులు సహకరించాలని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.గాబ్రియేల్ తెలిపారు.

దుప్పిలివాడలో ర్యాలీ చేస్తున్న మండల సాధన కమిటి నాయకులు

ధారకొండ మండలంగా ప్రకటించేవరకూ పోరాటం

ప్రజాశక్తి -సీలేరు: ధారకొండను మండల కేంద్రంగా ప్రకటించేవరకూ శాంతియుతంగా పోరాటం కొనసాగిస్తామని మండల సాధన కమిటీ నాయకులు సుంకర విష్ణుమూర్తి, మార్కరాజు సొన్ను పేర్కొన్నారు. జికె వీధి మండలం దుప్పిలివాడలో గురువారం ప్లకార్డులు పట్టుకుని పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. 'మండల కేంద్రం సాధించుకుందాం ఐకమత్యంగా పోరాడుదాం' అంటూ నినాదాలు చేశారు. అనంతరం సాధన కమిటి నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రం ధారకొండ ఏర్పడితేనే ఆరు పంచాయతీల్లో అభివృద్ధి జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికే కలెక్టర్, ఐటిడిఎ పిఒకు వినతి పత్రాలు అందజేశామన్నారు.

అన్నా క్యాంటీన్‌కు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న గిడ్డి ఈశ్వరి, తదితరులు,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని పాత బస్టాండ్ అంబేద్కర్ కూడలి సమీపంలో రైతు బజార్ స్థలంలో అన్నా క్యాంటీన్ భవన నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే, టిడిపి పాడేరు ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేదవాడి ఆకలి తీర్చేందుకు సీఎం చంద్రబాబు తీసుకున్న ఒక గొప్ప నిర్ణయం అన్నా క్యాంటీన్ అన్నారు. అన్న క్యాంటీన్ శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చి వెళ్లే పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పేదవాడి ఆకలి తీర్చే మహత్తర కార్యక్రమం గత ప్రభుత్వంలో ధ్వంసం చేశారన్నారు. అన్న క్యాంటీన్ నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసి ఐదు రూపాయలకే పేదవాడి ఆకలి తీరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు బొర్రా నాగరాజు, విజయరాణి, లకే పార్వతమ్మ, డి.వెంకటరమణ (బుజ్జి), శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

టైఫాయిడ్‌పై అవగాహన అవసరం

అవగాహన కల్పిస్తున్న కో ఆర్డినేటర్

ప్రజాశక్తి-చింతపల్లి : టైఫాయిడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరమని ఉందని సురక్ష పబ్లిక్ హెల్త్ కౌన్సిల్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ ప్రసన్నకుమారి అన్నారు. చింతపల్లి మార్కెట్‌యార్డు ప్రాంగణంలో గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతులు శుభ్రంగా కడుక్కోవడం, శుభ్రమైన నీరు తాగడం, వీధి ఆహారాలకు దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. డాక్టర్ రుక్మిణి మాట్లాడుతూ వర్షాకాలంలో కలుషిత నీరు, ఆహారం వల్ల టైఫాయిడ్ వ్యాప్తి వేగంగా జరుగుతుందని, వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధిని నివారించవచ్చని పేర్కొన్నారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కడుపు నొప్పి వంటి లక్షణాలు కనబడితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.సంపత్‌కుమార్, సామాజిక సేవకుడు అర్జున్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ముగ్గురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డుకు మండలం నుండి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఇఒ1 కెవీవీ సత్యనారాయణదొర, ఎంఇఒ 2 సూరయ్యరెడ్డి గురువారం తెలిపారు. అల్లూరి జిల్లాకు రాజవొమ్మంగి మండలం తరపున ఉత్తమ ఉపాధ్యాయులుగా గజిటెడ్ హెచ్ఎం రాజ్‌దినకర్, స్కూల్ అసిస్టెంట్ కె.ఆర్.శాంతిపాప, ఎస్‌జిటి ఎం.చంద్రశేఖర్ పేర్లను జిల్లా అధికారులు ఎంపిక చేసిన నేపథ్యంలో వారందరికీ ఎంఇఒలు అభినందనలు తెలిపారు. శుక్రవారం పాడేరులో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు వారు తెలిపారు.

శిథిలమైన బిటి రహదారి

సమగిర, రాచపనస మార్గంలో ఇబ్బందులు

పూర్తిగా ఛిద్రమైన సమగరి, రాచపనస తారురోడ్డు

పాడైన రోడ్డును చూపుతున్న స్థానిక వాహనదారుడు

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని గొందిపాకల పంచాయతీ పరిధిలోని సమగిరి నుండి రాచపనస వరకు సుమారు 4.5 కిలోమీటర్ల మేర నిర్మించిన బిటి రహదార పూర్తిగా శిథిలమైంది. ప్రజలు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి నిర్మించి ఆరేళ్లు కూడా గడవక ముందే రహదారి ఇలా దెబ్బతినడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.22 లక్షల వ్యయంతో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద గ్రామీణ అభివృద్ధి శాఖ నిధులతో పంచాయతీరాజ్ శాఖ ఈ రహదారి నిర్మాణం చేపట్టింది. అయితే పనులు చేజిక్కించుకున్న గుత్తేదారుడు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో తారు రహదారి వేగంగా పాడైపోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రహదారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారి వాహనాలే కాదు కాలినడకన కూడా వెళ్లడం కష్టసాధ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ధృడ సంకల్పముంటే లక్ష్యసాధన సులభమే

గీతంలో జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్

జివిఎంసి కమిషనర్‌ను సత్కరిస్తున్న గీతంప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : జీవిత లక్ష్యాలపై స్పష్టమైన అవగాహన, వాటిని సాధించడానికి ధృడ సంకల్పం ఉంటే ఐఎఎస్ వంటివి సాధించడం పెద్ద కష్టం కాదని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. గురువారం గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలోముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజస్థాన్‌లోని మారుమూల గ్రామం నుంచి ఎదిగిన తాను బ్యాంక్ ఆఫీసర్ ఉద్యోగం మొదలుకొని 8 ప్రభుత్వ ఉద్యోగాలలో పని చేస్తూ ఏ విధమైన శిక్షణ లేకుండా సివిల్స్‌లో విజయం సాధించి ఐఎఎస్‌కు ఎంపికైన తీరును వివరించారు. జీవితంలో పోటీ అనేది లక్ష్యాలు సాధించడానికి ముందు, ఆ తరువాత కూడా ఎదుర్కొవలసి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు జీవితంలో తాము ఏమి సాధించాలనే లక్ష్యం పట్ల స్పష్టత కలిగి ఉండాలని, అందుకు తగిన విధంగా క్రమశిక్షణతో కృషి చేయాలని, విజయాలు అప్పుడే దరి చేరుతాయన్నారు. ఏ వృత్తిలో అయినా పోటీ తప్పదని అది ఉన్నప్పుడే ప్రతిభ వెలుగు చూస్తుందని అన్నారు. సామాజిక మాధ్యమాలను వ్యక్తిగత ప్రగతికి ఉపయోగించుకోవాలని, విలువైన సమయం వృథా చేయకూడదని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. కార్యక్రమానికి గీతం ప్రో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, సీనియర్ ప్రొఫెసర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు

అమెజాన్ ఫ్యాషన్‌లో ప్రత్యేక ఉత్పత్తులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పండగ సీజన్ ప్రారంభమవడంతో వినియోగదారులకు వ్యక్తిగతంగా, స్టైలిష్‌గా, విలాసవంతమైన,స్మార్ట్ ఎంపికలు అందించేలా అమెజాన్ ఫ్యాషన్ పలు ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు ఆ సంస్థ ప్రతినిధి నివాస్ చెప్పారు. ఒక హెూటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ,స్టేట్‌మెంట్ మినీ బ్యాగ్స్, ఉత్తమమైన జ్యూయలరీ నుండి టెక్ స్మార్ట్ లగేజీ, ప్రీమియం ఫ్యాషన్ వరకు సీజన్‌లో అందిస్తున్నామని తెలిపారు. వేగవంతమైన డెలివరీతో కలిపిన అంతర్జాతీయ, దేశీయంగా వృద్ధి చెందిన బ్రాండ్స్ విస్తృతమైన, కూర్పు చేయబడిన ఎంపికను అందించడం ద్వారా ఈ పరివర్తను అమెజాన్ ఫ్యాషన్‌కు వీలు కల్పిస్తోందన్నారు. వినియోగదారులు పండగ సీజన్‌ను సులభంగా, ఆత్మవిశ్వాసంతో, మెరుగైన స్టైల్‌తో సంబరం చేసుకోవచ్చున్నారు.

ఎంఇఒ-2 నాగేశ్వరరావుకు సత్కారం

సత్కరిస్తున్నఉపాధ్యాయ సంఘాల నేతలు

ప్రజాశక్తి -అనంతగిరి:మండల విద్యాశాఖ అధికారి 2 గా బాధ్యతలు స్వీకరించిన బిబి. నాగేశ్వరరావుకు మండల ఉపాధ్యాయ సంఘాల నేతలు ఉపాధ్యాయులు కలిసి మర్యాదపూర్వకంగా అభినందనలు తెలిపారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ 2కు యుటిఎఫ్ జిల్లా నాయకులు పుడిగి. దేముడు నేతృత్వంలో మండల యూటిఎఫ్ బృందం కలిసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సింహాచలం, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

ఉపాధ్యాయులతో విద్యార్థులు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో గాంధీనగర్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో ముందస్తుగా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎం.మత్స్యరాజు, ఉపాధ్యాయులు కేసవర్ధన్, నాగమణి, రాంబాబు, లక్ష్మీ పాల్గొన్నారు.

మహిళా సిబ్బందికి అసభ్యకర మెసేజ్‌లు పంపిన

మాజీ ఉద్యోగికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : మహిళా సిబ్బందికి అసభ్యకర మెసేజ్‌లు పంపిన మాజీ ఉద్యోగికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎం. ప్రదీప్‌కుమార్ గురువారం తీర్పు వెలువరించారు. బుట్టచిరాజుపాలెం నివాసి, పాత్ర ఇండియా బిపిఒ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మాజీ ప్రాసెస్ ఎగ్జిక్యూటివ్ డబ్బేరు సాయికుమార్ నకిలీ ఈమెయిల్స్ ఉపయోగించి మహిళా సిబ్బందికి దూషణాత్మక, లైంగిక సూచనలతో కూడిన సందేశాలను పంపేవాడని విచారణలో తేలింది. కంపెనీ తరపున అడ్మినిస్ట్రేటివ్ ఎగ్జిక్యూటివ్ మీసాల లోకేశ్ 2024 ఏప్రిల్ 10న సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిఐ కె. భవాని ప్రసాద్‌రావు దర్యాప్తు జరిపి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా, సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపిల్లి ఆదినారాయణ వాదించి, నిందితుడి అభియోగాలను నిరూపించారు. దీంతో నిందితుడికి మూడేళ్లజైలుశిక్షతోపాటు రూ.30వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు.. జరిమానా చెల్లించకపోతే మరో రెండు నెలలు సాదారణ కారాగార శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. కాగా గతంలో ఇదే నిందితుడు శేషపు దుర్గాభవానిపై ఇలాంటి నేరానికి పాల్పడగా, ఆ కేసులోనూ మూడేళ్ల జైలు, రూ.30వేలు జరిమానా విధించారు.

రైతులకు యూరియా అందిస్తున్న ఎఒ

రైతులకు యూరియా పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యూరు: మండలంలోని మంప రైతు సేవా కేంద్రంలో మంప, బుదరాళ్ల రైతులకు గురువారం యూరియా పంపిణి చేసినట్టు ఎఒ తెలిపారు. సుమారు 192 మంది రైతులకు అందించామన్నారు. కార్యక్రమంలో కొయ్యూరు సిఐ శ్రీనివాసరావు, మంప ఎస్ఐ శంకరరావు, మంప వైస్‌సర్పంచ్ గాంధీ, విహెచ్ఎ ప్రభాకర్, మాజీ ఎంపిటిసి శివరామరాజు, మాజీ సర్పంచ్ సత్తి బాబు, బుదరాళ్ల ఎంపిటిసి సర్పంచ్ సంజీవరావు పాల్గొన్నారు.

కొబ్బరి మొక్కలను సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు పంపిణీ చేసిన కొబ్బరి మొక్కలను రైతులు సంరక్షించుకోవాలని ఎంపిడిఒ లోకుల యాదగిరిశ్వరరావు, ఎపిఒ శ్రీనివాసరావు అన్నారు. గురువారం ప్రోగ్రాం అధికారి ఎంపిడిఒ దూసరపాములో తూము రాంబాబు అనే రైతుకు పంపిణీ చేసిన కొబ్బరి మొక్కలను పరిశీలించారు. పంపిణీ చేసిన మొక్కల నాణ్యతపై ఆరా తీసి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వీరబాబు పాల్గొన్నారు.

ట్రోఫీతో ఎపి కబడ్డీ క్రీడాకారులు

జాతీయస్థాయి కబడ్డీలో ఎపి ఎలక్ట్రిసిటి జట్టుకు తృతీయస్థానం

ప్రజాశక్తి -సీలేరు: జాతీయస్థాయి 47వ కబడ్డీ పోటీల్లో ఎపి ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జట్టు పోటీల్లో సత్తా చాటి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుందని జట్టు కెప్టెన్ ఎపి జెన్‌కో ఎఇ (సీలేరు క్యాంపు) సిహెచ్ సురేష్ వెల్లడించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ యాదాద్రిగుట్టలో నిర్వహించిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జట్టు తెలంగాణ ఎలక్ట్రిసిటీ బోర్డు జట్టుతో గురువారం తలపడగా నిర్దేశించిన సమయంలో ఆట ముగిసే సమయానికి 45-25 స్కోర్ తో ఎపి జట్టు తెలంగాణ పై 17 పోయింట్లు ఆధిక్యంతో తృతీయస్థానం కైవసం చేసుకుందన్నారు. ఎపి జట్టు జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో మొట్ట మొదటిసారిగా తృతీయ స్థానం దక్కించుకుని రికార్డు నెలకొల్పిందన్నారు. స్పోర్ట్స్ ఆఫీసర్ కుమార్ వడివేలు కెప్టెన్ శ్రీనివాసరావు, జట్టు మేనేజర్ సురేష్‌ను ప్రశంసించారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - వై.రామవరం : మండలంలోని కానీవాడ పంచాయతీ పరిధిలో గల కానివాడ గ్రామం నుంచి జిటి మామిడివరకూ ఐదు కిలోమీటర్ల తారురోడ్డు మంజూరైందని శంకుస్థాపన చేసేందుకు టిడిపి మండల అధ్యక్షుడు పొత్తూరు కాంతారెడ్డి, ఎంపిపి కడపల ఆనంద్ జెడ్‌పిటిసి కర్ర వెంకటలక్ష్మి, ఎంపిటిసి వీరలక్ష్మి, సుబ్బలక్ష్మి వైస్ ఎంపిపి ముర్ల జోగిరెడ్డి, సర్పంచ్ పలాల శిల్పరాణి టిడిపి కార్యకర్తలు కుంజం చిన్నాలుదొర, ప్రధాన కార్యదర్శి చెదల దినేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ..రోడ్డు ఒక్కటే మార్గం

కోతకు గురైన రహదారి

ప్రజాశక్తి - విఆర్‌పురం: మండలంలోని మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న ములకపల్లి, కోటారుగొమ్ము, ఇప్పురుపోచవరం, కొల్లూరు, గొందూరు నాటు పడవలపై ప్రయాణం చేసే గ్రామాల గిరిజనులు సైతం మండల కేంద్రానికి రాకపోకలు కొనసాగించాలంటే ఆ రోడ్డు ఒక్కటే మార్గం. అలాంటిది ఇప్పుడు ఆంధ్రా, ఒరిస్సా తెలంగాణ రాష్ట్రాల్లో ఎడతెరిపి లేని భారీ వర్షాలతో చుట్టుపక్కల రోడ్లు కొట్టుకునిపోయి గుంతలు ఏర్పడి మరింత అధ్వానంగా తయారయ్యాయి. దీని వలన మారుమూల ప్రాంతాల్లో నివసించే గిరిజనులు మండల కేంద్రానికి రావాలంటే ఆందోళన చెందుతున్నారు. రోడ్డు ఒక పక్క కోరివేతకు గురై కొట్టుకుపోయింది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది కాబట్టి తక్షణమే అధికారులు స్పందించి రహదారి బాగు చేయాలని కోరుతున్నారు.

బాలామృతం ప్యాకెట్లు పంపిణీ

ప్యాకెట్లు పంపిణి చేస్తున్న సూపర్‌వైజర్

ప్రజాశక్తి-సీలేరు: జికె వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ అన్నవరం మినీ అంగన్‌వాడి కేంద్రంలో కాలం చెల్లిన బాలామృతం ప్యాకెట్లు నిర్వాహకులు చిన్నారులకు అందజేస్తున్నారు అనే శీర్షికన పలు పత్రికల్లో ప్రచురితమవడంతో జికె వీధి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మాలతి స్పందించారు. గురువారం అన్నవరం మినీ అంగన్‌వాడి కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్త ప్యాకెట్లను చిన్నారులకి సూపర్‌వైజర్ సమక్షంలో పంపిణీ చేశారు. కాలం చెల్లిన ప్యాకెట్లు ఎందుకు పంపిణీ చేశారని సూపర్‌వైజర్, అంగన్‌వాడి కార్యకర్తపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. మహిళా పోలీసు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు

తక్షణమే పంపిణీ చేయాలి

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి - విఆర్‌పురం: మండలంలో వరద బాధితులకు నిత్యావసర వస్తువులు, కిరోసిన్, దోమతెరలు పంపిణి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలో సిపిఎం బృందం వరద బాధితులతో మాట్లాడారు. వారం రోజులుగా మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయని నిత్యావసర వస్తువులు అందక పలువురు అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వరద బాధితులకు నిత్యావసర వస్తువులు అందించాలని లేనిపక్షంలో బాధితులతో కలసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, సోడి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'పనులు నాణ్యతతో చేయాలి'

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఉపాధి పథకం నిధులతో ప్రహరీ నిర్మిస్తున్నామని పనులు నాణ్యతతో చేపట్టాలని రంపచోడవరం పిఒ కట్టా సింహాచలం ఆదేశించారు. గురువారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రహరీ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌కు, జూనియర్ కళాశాల ప్రాంగణంలో సుమారు 350 మీటర్లకు ప్రహరి నిర్మాణానికి రూ.25 లక్షల వ్యయంతో ఉపాధి పథకం నిధులతో నిర్మించడం జరుగుతుందని అన్నారు. నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఎంపిపి బంధం శ్రీదేవి, జడ్పిటిసి పండ వెంకటలక్ష్మి, ఎంపిటిసి కుంజం వంశీ, హైస్కూల్ చైర్మన్ సుందర్‌సింగ్, తహశీల్దార్ బాలాజీ, డిప్యూటీ ఎంపిడిఒ రాజబాబు, డిప్యూటీ ఇంజనీర్ భవాని, ఎఈ ప్రదీప్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ పాల్గొన్నారు.

మండల స్థాయి అధికారులకు ఒక్కరోజు శిక్షణ

ప్రజాశక్తి-మారేడుమిల్లి: మారేడుమిల్లి ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, ఎంపిటిసిలు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ తరగతులు ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, స్వచ్ఛ త్రాగునీరు సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలతో రాష్ట్ర ప్రభుత్వం విధాన పరమైన నిర్ణయాలతో ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలు తయారుచేసి ఆచరణలోకి తీసుకొచ్చిందని దానికి అనుగుణంగా శిక్షణ పొంది సమన్వయంతో ప్రభుత్వ విధానాలు అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాకబ్, వివిధ గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్నాపల్లిలో నీటిసంఘం ఏర్పాటు

ప్రజాశక్తి - జికెవీధి : మండలంలోని జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఏర్పాటుచేసిన నీటి ట్యాంకుల పరిరక్షణ ప్రత్యేక నీటిసంఘం కమిటి ద్వారా 15 మంది సభ్యులను ఏర్పాటు చేస్తున్నారు. సంకాడ పంచాయతీకి చెందిన ఎర్నాపల్లిలో జలజీవన్ మిషన్ ద్వారా నిర్మించిన నీటిట్యాంకు సమస్యలు తలెత్తినప్పుడు ఈ కమిటీ వసూలు చేసిన డబ్బు మెయింటెనెన్స్ ఈ కమిటీ ద్వారా పరిరక్షించాలని ఉద్దేశంతోకమిటీలను ఏర్పాటు చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి జ్యోతిరాణి తెలిపారు. కార్యక్రమంలో సంకాడ సర్పంచ్ నాగులమ్మ, కూటమి నాయకులు నాగేంద్ర చంటిబాబు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీలు, కుర్చీలు వితరణ

డాక్టర్ కంటా స్వాతి, టీం మెంబర్స్

ప్రజాశక్తి - మారేడుమిల్లి: వై.రామవరం మండలం పాతకోట పంచాయతీ పరిధిలోని గంగనూరు జిపిఎస్ పాఠశాల విద్యార్థులకు రాజమహేంద్రవరానికి చెందిన ఆర్ఎస్ న్యూరో సొసైటీ డైరెక్టర్ డాక్టర్ కంటా స్వాతి, రమీజ్ ఉద్దీన్‌షేక్ సొసైటీ సభ్యులు సహకారంతో పాఠశాలకు బ్లాక్‌బోర్డ్ చార్ట్స్, బెంచీలు, కుర్చీలు, పుస్తకాల బ్యాగులు స్టేషనరీ, ఆటవస్తువులు పంపిణీ చేశారు. అదేవిధంగా స్కూల్ ప్రహరీకి సంబంధించి ఇనుపమెస్ కూడా పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు డాక్టర్ కంట స్వాతికి రమీజ్ ఉద్దీన్‌షేక్ మెంబర్స్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

విశాఖలో ఫ్రెష్ ఐడి స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రముఖ ఆహార ఉత్పత్తుల తయారీదారు సంస్థ ఫ్రెష్ ఐడి దేశంలోనే మొట్టమొదటి అవుట్‌లెట్‌ను విశాఖపట్నంలోని మాధవధార జంక్షన్‌లో ప్రారంభించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంస్థ సిఇఒ రాజత్ దివాకర్ మాట్లాడుతూ తమ సంస్థ ఉత్పత్తులు ఇడ్లీ, దోస, వడ బ్యాటర్లు ఏ విధమైనటువంటి ప్రిజర్వేటివ్స్ లేకుండా సహజమైన తాజా ప్రోడక్టులను అందించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రజల నుంచి వస్తున్న మద్దతు ఆధారంగా కంపెనీ అవుట్‌లెట్‌లను వినియోగంలోకి తీసుకు వస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో నగరవ్యాప్తంగా 50 అవుట్లెట్లను తెరిచే లక్ష్యంతో ముందుకు వెళతున్నామన్నారు.

విశాఖ మార్కెట్‌లో గూగుల్ 5.0 టివిలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఇండ్‌కల్ టెక్నాలజీస్‌కి చెందిన స్వదేశీ సాంకేతిక బ్రాండ్ వాబుల్ డిస్‌ప్లేస్, మాక్సిమస్ సిరీస్ 116.5 అంగుళాల గూగుల్ టీవీ 5.0 ను విశాఖ మార్కెట్‌లో ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఇండ్‌కల్ టెక్నాలజీస్ సిఇఒ ఆనంద్‌దూబె మాట్లాడుతూ ఇప్పటివరకూ భారత దేశ మార్కెట్‌లో విడుదలైన అతిపెద్ద టివి ఇదేనని అన్నారు. ఇది థియేటర్ స్థాయి అనుభూతిని కలిగిస్తుందని అన్నారు.

'జన్యు హృద్రోగం పిల్లలకు ఉచిత చికిత్స'

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : జన్యు హృద్రోగం కలిగిన పిల్లలకు ఆర్‌బిఎస్‌కే, ఆరోగ్యశ్రీ పథకాల కింద మెడికవర్ హాస్పిటల్‌లో ఉచిత చికిత్స అందిస్తున్నామని ఆసుపత్రి డైరెక్టర్ పాడికరుణాకర్ తెలిపారు. వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆసుపత్రిలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలామంది తల్లిదండ్రులు ఆర్థిక భారము వల్ల శస్త్రచికిత్స చేయించుకోలేకపోతున్నారని తెలిపారు. వీటిని దృష్టిలో ఉంచుకుని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె) అనే పథకాన్ని ప్రారంభించిందని వెల్లడించారు. దీని కింద ఉచితంగా చికిత్స అందిస్తామని, ఆరోగ్యశ్రీ పథకంలో కూడా ఉచితంగా జరుగుతుందని తెలిపారు.

శామ్‌సంగ్ ఎఐ, డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శామ్‌సంగ్ గెలాక్సీ సాధికారత కార్యక్రమాన్ని నగరంలో ప్రారంభించింది. కమ్యూనిటీ ఆధారిత ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వాహకులు ఆధునిక డిజిటల్ సాధనాలు,బోధన పద్ధతుల్లో నైపుణ్యం పొందేలా చేసి,తరగతి గదులను మార్చడమే దీని లక్ష్యం అని సాంసంగ్ ఇండియా రీజినల్ హెడ్ హిమాన్షు గుప్తా తెలిపారు. ఇప్పటికే 250కి పైగా పాఠశాలలకు చేరుకుని 2,700 మందికి పైగా ఉపాధ్యాయులను ధ్రువీకరించిన గెలాక్సీ సాధికారత కార్యక్రమం తన కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాలకు విస్తరించిందన్నారు.